సాక్షి
అన్నమయ్య జిల్లా
సోమవారం । 23 । సెప్టెంబర్ । 2024



వరికి తెగులు.. రైతుకు దిగులు
వ్యవసాయమే జీవనాధారంగా పోరాటం చేస్తున్న రైతులపై ప్రకృతి పగబట్టింది. అంతంత మాత్రంగా సాగైన వరి పంటకు సుడిదోమ తెగులు పట్టి పీడిస్తోంది. -8లో



రెవెన్యూలో చిత్తుకాగితాల కాల్చివేత చిచ్చు
రాజంపేట తహసీల్దారు కార్యాలయంలో చిత్తుకాగితాల కాల్చివేత చిచ్చు జిల్లా రెవెన్యూ శాఖను అభాసుపాలు చేసింది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్ఠం	గరిష్ఠం
మొదటిరకం	రూ.440	రూ.516
రెండోరకం	రూ.340	రూ.436

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 134 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సు
మదనపల్లె సిటీ: తంబళ్లపల్లె మల్లయ్యకొండకు సోమవారం ప్రత్యేక బస్సు సర్వీసు నడపనున్నట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం 6.30 గంటలకు బయలుదేరి నేరుగా కొండకు చేరుకుంటుందన్నారు. సాయంత్రం వరకు రాగిమానుసర్కిల్ నుంచి మల్లయ్యకొండకు షటిల్ సర్వీసు తిరుగుతుందన్నారు. భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

రాజంపేటకు ఇద్దరు రేంజర్లు
రాజంపేట: రాజంపేట అటవీశాఖకు ఇద్దరు రేంజర్లు నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న రేంజర్ నారాయణ పలమనేరుకు బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో శివన్న, దత్తాత్రేయ నియమితులయ్యారు. ఈమేరకు ఆ శాఖ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. రేంజర్ శివన్న పలమనేరు నుంచి రాగా, దత్తాత్రేయ భాకరాపేట నుంచి రాజంపేటకు బదిలీ అయ్యారు.

గంగమ్మా..కాపాడు తల్లీ..



గంగమ్మ తల్లికి పూజలు చేస్తున్న పూజారులు

లక్కిరెడ్డిపల్లి: వర్షాలు కురిపించి రైతులు, ప్రజలు అందరూ చల్లగా ఉండేలా కాపాడు తల్లీ అంటూ ఆదివారం గంగమ్మ దేవతకు భక్తులు బోనాలు సమర్పించారు. తలనీలాలు అర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలిరావడంతో క్యూలైన్లు నిండిపోయాయి. ఆలయ చైర్మన్ రెడ్డయ్య, ఆలయ ప్రత్యేకాధికారి మారుతీ ప్రసాద్‌లు భక్తులకు సౌకర్యాలు కల్పించారు. పూజారులు చెల్లు వంశీయులు గంగరాజు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సమరసింహారెడ్డిలు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

హంద్రీ–నీవాపై కనికరిస్తారా!

- ప్రాజెక్టు పూర్తికి రూ.629 కోట్లు కావాలి
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.1,217 కోట్లతో పీబీసీ విస్తరణ
- కుప్పానికి రూ.535 కోట్లతో రెండు రిజర్వాయర్లు మంజూరు
- టీడీపీ అడ్డంకులతో ఆగిపోయిన 3 రిజర్వాయర్ల పనులు
- నేడు అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో మంత్రి నిమ్మల ప్రాజెక్టు పరిశీలన



కుప్పం ఉపకాలువలో జరుగుతున్న కాంక్రీట్ పనులు

బి.కొత్తకోట: కరువుకు నిలయమైన అన్నమయ్య, చిత్తూరుజిల్లాలకు తాగు, సాగునీటిని అందించే వరప్రదాయిని ఏపీఆర్ హంద్రీ–నీవా రెండో దశ ప్రాజెక్టు. పూర్తి కావొచ్చిన ఈ ప్రాజెక్టుకు టీడీపీ ప్రభుత్వాల్లో నిర్లక్ష్యమే జరిగింది. కరువు రైతుల సంక్షేమం కోసం గత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుని రూ.వేల కోట్లు మంజూరు చేశారు. ఈ పనులు పూర్తి చేస్తే వైఎస్సార్‌సీపీకి పేరొస్తుందని నిర్లక్ష్యం వహించకుండా రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకోవాల్సి ఉంది. సోమవారం జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నమయ్య, చిత్తూరుజిల్లాల్లో హంద్రీ–నీవా ప్రాజెక్టును పరిశీలించనున్న నేపథ్యంలో నిధులు, పనులపై దృష్టి సారించాల్సి ఉంది. కోస్తా ప్రాంతంలోని పాజెక్టుల పూర్తికి చూపిస్తున్న శ్రద్ధ ఈ ప్రాజెక్టు విషయంలోనూ చూపాలని రైతులు కోరుతున్నారు.

రూ.629 కోట్లతో ప్రాజెక్టు పూర్తి
అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో హంద్రీ–నీవా ప్రాజెక్టును పూర్తి చేయాలంటే రూ.629 కోట్లు కావాలి. ప్రాజెక్టులో భాగమైన పెండింగ్ ఉప కాలువలు, డిస్ట్రిబ్యూటరీల కాలువలు, స్ట్రక్చర్స్ పూర్తవుతాయి. ఈ నిధుల్లోనే రూ.150 కోట్లు కేటాయిస్తే..ప్రధానకాలువపై చిన్నమండెం మండలం పడమటికోన వద్ద 700 మీటర్ల కాలువ, కలకడ వద్ద 500 మీటర్ల కాలువ తవ్వకం, 12 చోట్ల స్ట్రక్చర్స్ నిర్మిస్తే పెండింగ్ పనులు పూర్తయి అడవిపల్లె, శ్రీనివాసపురం రిజర్వాయర్లకు కృష్ణా జలాలను తరలించవచ్చు. పూర్తి నిధులు సమకూరిస్తే ప్రాజెక్టు పూర్తవుతుంది. తద్వారా సాగు, తాగునీటి కష్టాలు తీరుతాయి.

పీబీసీ పెండింగ్ బిల్లులు:	రూ.117 కోట్లు
కుప్పం ఉపకాలువకు:	రూ.59 కోట్లు
కుప్పం కాలువ లైనింగ్ పనులకు:	రూ.180 కోట్లు
పీబీసీ విస్తరణకు (గత ప్రభుత్వం మంజూరు చేసింది):	రూ.1,217 కోట్లు
కుప్పం రిజర్వాయర్లకు (గత ప్రభుత్వం మంజూరు చేసింది):	రూ.535 కోట్లు
సాగులోకి వచ్చే భూమి:	2.14 లక్షల ఎకరాలు
తాగునీరు:	10 లక్షల జనాభాకు

పీబీసీ విస్తరణతో ఎంతో లాభం
అన్నమయ్య, చిత్తూరుజిల్లాల్లో పుంగనూరు ఉపకాలువ (పీబీసీ) విస్తరణ పనులకు 2020లో సీఎం వైఎస్.జగన్ నిధులు మంజూరు చేశారు. 2022 సెప్టెంబర్‌లో జరిగిన టెండర్లలో నాగార్జున కన్స్‌స్ట్రక్షన్ కంపెనీ రూ.1,217 కోట్లతో పని దక్కించుకుంది. 380 క్యూసెక్కుల నీటి ప్రవాహం కలిగిన పీబీసీలో అదనంగా 800 క్యూసెక్కులకు పెంచేలా విస్తరణ పనులు జరగాలి. అన్నమయ్య జిల్లా పెద్దతిప్పసముద్రం మండలం సీవీరామన్నగారిపల్లె వద్ద కిలోమీటర్ 79.600 నుంచి చిత్తూరుజిల్లా పలమనేరు నియోజకవర్గం పెద్దపంజాణి మండలంలో కిలోమీటర్ 220.350 వరకు విస్తరణ పనులు పూర్తి చేయాలి. కాంట్రాక్టర్ మదనపల్లె మండలంలో కొంత పనులు చేపట్టగా రూ.117 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ విస్తరణ పనులు పూర్తిస్థాయిలో చేపట్టి పూర్తి చేసేందుకు మంత్రి దృష్టి సారించాలి.

కుప్పానికి రెండు రిజర్వాయర్లు
కుప్పం ప్రజలకు మంచి చేయాలని రెండు రిజర్వాయర్ల నిర్మాణానికి గత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రూ.535 కోట్లు మంజూరు చేశారు. కుప్పం ప్రజలకు తాగునీరు, పారిశ్రామిక అవసరాల కోసం నిర్మించాలని నిర్ణయించారు. ద్రావిడ విశ్వవిద్యాలయం సమీపం యామిగానిపల్లె వద్ద పెద్దనాయనిచెరువును యామిగానిపల్లె రిజర్వాయర్‌గా ఆధునీకీకరించి 0.7 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికి పెంచడం, శాంతిపురం మండలంలోని మాదనపల్లె సమీపంలో పెద్దన్న చెరువును 0.3 టీఎంసీలకు పెంచి రిజర్వాయర్‌గా అభివృద్ధి చేస్తారు. వీటికి కుప్పం ఉపకాలువ నుంచి కృష్ణాజలాలు తరలిస్తారు. పనులకు గత ప్రభుత్వమే నిధులు మంజూరు చేయడంతో ప్రస్తుత ప్రభుత్వం టెండర్లు నిర్వహించి పనులు చేయించాల్సి ఉంది.

కృష్ణా జలాలు ఎప్పుడు
వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అక్టోబర్ నెలలోనే జిల్లాకు కృష్ణా జలాలను తరలించి 91 చెరువులు, సమ్మర్‌స్టోరేజీ ట్యాంకులను నింపారు. 2019 నుంచి మూడేళ్ల పాటు ఉమ్మడి చిత్తూరు జిల్లాకు 6.4618 టీఎంసీల కృష్ణా జలాలు రప్పించారు. ఈ ఏడాది కృష్ణా జలాలు రప్పించాల్సి ఉన్నా ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నట్టు కనిపించడం లేదు. వచ్చే ఏడాదిలో రప్పించే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇలా జరిగితే కరువు రైతులు నీటి కష్టాలను ఎదుర్కొవాల్సి వస్తుంది. త్వరగా జలాలను పారించాలని రైతాంగం కోరుతోంది.

నేడు మదనపల్లెకు మంత్రి రాక
మదనపల్లె: రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సోమవారం మదనపల్లెలో పర్యటిస్తారని తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హంద్రీ– నీవా కాలువ పరిశీలనలో భాగంగా మంత్రి సోమవారం ఉదయం 8 గంటలకు తంబళ్లపల్లె నియోజకవర్గం కురబలకోట మండలం దొమ్మన్నబావి పీబీసీని, 9 గంటలకు చిప్పిలి సమ్మర్‌స్టోరేజీ ట్యాంక్‌ను పరిశీలిస్తారన్నారు. అనంతరం 11 గంటలకు కుప్పం బ్రాంచ్ కెనాల్ టేకాఫ్ పాయింట్, పంప్‌హౌస్ కే–1ను పరిశీలిస్తారన్నారు.

ఆగిపోయిన రిజర్వాయర్ల పనులు
గత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రైతుల నీటి కష్టాలను తీర్చాలని తంబళ్లపల్లె నియోజకవర్గం కురబలకోట మండలం ముదివేడు సమీపంలో కొండల మధ్య రిజర్వాయర్ నిర్మాణానికి రూ.759.50 కోట్లు, మదనపల్లె రూరల్ మండలం నేతికుంటపల్లె సమీపంలో రిజర్వాయర్ నిర్మాణానికి రూ. 717.80కోట్లు, చిత్తూరుజిల్లా పుంగనూరు నియోజకవర్గం సోమల మండలం ఆవులపల్లె సమీపంలోని రిజర్వాయర్ నిర్మాణానికి రూ.667.20కోట్లు మంజూరు చేశారు. వీటి పనులు చేపట్టగా టీడీపీ కుట్రలతో పనులను ఎన్‌జీటీ ద్వారా అడ్డుకోవడంతో అర్ధంతరంగా నిలిచిపోయాయి. రైతు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పనుల పూర్తికి ప్రభుత్వం కృషి చేయాలి.

- 2015లో రూ.413కోట్లతో టెండర్లు నిర్వహించగా 4 శాతం అదనంతో రూ.430.27 కోట్లతో హెచ్ఈఎస్–ఆర్‌కే–కోయా జాయింట్ వెంచర్ కాంట్రాక్టు సంస్థ పనులు దక్కించుకుంది. కాంట్రాక్టు సంస్థకు గత టీడీపీ సర్కార్ అదనం పేరుతో అడ్డంగా రూ.144.7 కోట్లు దోచిపెట్టింది. 2019లో అధికారం మారగానే పనులు పూర్తిచేయకుండా వదిలేసింది. దీంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మరో కంపెనీకి గత ఒప్పంద విలువకే రూ.117.17 కోట్ల పనులను అప్పగించింది. టెండర్ల ద్వారా పనులు అప్పగించి ఉంటే కొత్త ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం ప్రభుత్వానికి రూ.25 కోట్ల మేర భరించాల్సి వచ్చేది. గత ప్రభుత్వంలో రూ.40.40 కోట్ల పనులు పూర్తి చేయగా రూ.59 కోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటి పూర్తికి కృషి చేయాల్సి ఉంది. కాగా 700 కిలోమీటర్ల దూరం నుంచి కృష్ణా జలాలు కుప్పానికి తరలించాల్సి ఉండటంతో కాలువకు లైనింగ్ పనులు చేయిస్తే నీటి ప్రవాహ నష్టాలు తగ్గించొచ్చని అధికారులు నిర్ణయించారు. దీంతో రూ.180 కోట్లతో లైనింగ్ పనులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

దర్జాగా చోరీ.. ఎంచక్కా పరారీ

- జిల్లాలో మూడు ఏటీఎం మిషన్‌లపై దుండగుల దాడి
- ఆధునిక గ్యాస్‌కట్టర్స్, బ్లాక్ స్ప్రేలతో చోరీ



ఒంటిమిట్టలో ఏటీఎంను పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఒంటిమిట్ట సీఐ కృష్ణంరాజునాయక్




ఏటీఎం సెంటర్‌లో చోరీకి పాల్పడుతున్న దుండగుల పుటేజీ దృశ్యాలు

కడప అర్బన్: బ్యాంకు ఏటీఎంలే లక్ష్యంగా చోరులు రెచ్చిపోయారు. జిల్లాలో ఒకే రోజు పలు చోట్ల చోరీకి పాల్పడ్డారు. వందలా.. వేలా.. లక్షలాది రూపాయాలు దోచుకుని ఎంచక్కా పరారయ్యారు. వివరాల్లోకి వెళితే కడప నగరంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో విశ్వేశ్వరయ్య సర్కిల్ సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్‌కు మొదట దుండగులు కారులో వచ్చారు. అక్కడకు శనివారం (తెల్లారితే ఆదివారం) అర్ధరాత్రి సుమారు 12:40 గంటలకు వచ్చి బ్లాక్ స్ప్రేతో సీసీ కెమెరాలపై స్ప్రే చేశారు. ఆపై మిషన్ అంచులకు ఒకరకమైన జెల్ స్ప్రే చేశా రు.గ్యాస్ కట్టర్‌లను ఉపయోగించకముందే ఓపెన్ చేసేందుకు ప్రయత్నించగా.. ఏటీఎం మిషన్ నుంచి పెద్ద శబ్దంతో సైరన్ మోగింది. దీంతో భయపడిన దొంగలు అక్కడి నుంచి పరారయ్యారు. ఆపై తెల్లవారుజామున 2–3 గంటల సమయంలో ద్వారకానగర్‌లో రైతుబజార్ సమీపంలో హాస్పిటల్స్ పక్కనున్న ఎస్‌బీఐ ఏటీఎంను టార్గెట్ చేశారు. అక్కడ ఎవరూ లేరని గుర్తించి తమవెంట తెచ్చుకున్న 'సూట్‌ల'ను ధరించారు. ముఖాలు కూడా కనిపించనీయకుండా ఒళ్లంతా కవర్ చేసుకుని ఏటీఎం సెంటర్‌లోకి ప్రవేశించారు. లోపలికి మిషన్ దగ్గరకు చేరుకున్న వ్యక్తి జెల్‌ను స్ప్రే చేశాడు. సీసీ కెమెరాల నుంచి కనిపించకుండా బ్లాక్ స్ప్రేతో కవర్ చేశారు. రెండవ సారి అలారం మోగకుండా జాగ్రత్తపడిన దుండగులు ఎంచక్కా మిషన్‌ను గ్యాస్ కట్టర్స్ ద్వారా తెరిచి అందులోని రూ. 6,19,300 నగదును అపహరించారు. తరువాత కేవలం 40 నిమిషాల వ్యవధిలోనే రాజంపేట రహదారిలో ప్రయాణించారు. ఒంటిమిట్టకు చేరుకుని అక్కడ తెల్లవారుజామున 3.40 గంటలకు పోలీస్ స్టేషన్ సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎం మిషన్‌లోకి ప్రవేశించారు. అక్కడా అదే పద్ధతిలో నగదు చోరీ చేశారు. అందులో దాచి ఉంచిన రూ. 36,11,400లను దోచుకుని వెళ్లారు. రెండు ఏటీఎం మిషన్‌లనుంచి మొత్తం రూ.42,30,700 నగదును అపహరించారు.

ఏటీఎం మిషన్‌ల దోపిడీ గ్యాంగ్ కోసం ప్రత్యేక పోలీసు బృందం
వైఎస్ఆర్ జిల్లా కడపలో, ఒంటిమిట్టలో ఎస్‌బీఐ ఏటీఎం మిషన్‌లలో దోపిడీలకు పాల్పడిన దుండగులను పట్టుకునేందుకు ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు నేతృత్వంలో పోలీసు అధికారుల బృందాలను ఏర్పాటు చేశారు. ఆదివారం తెల్లవారుజామునుంచే వారిపై నిఘా ఉంచి తమ వంతుగా విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు.

భద్రత డొల్లతనం?



జిల్లాలో వివిధ కేటగిరీలకు చెందిన 28 రకాల బ్యాంకులు ఉన్నాయి. 372 బ్రాంచ్‌లతో పాటు, దాదాపు 600 వరకు బ్యాంక్‌ల ఏటీఎంలు ఉన్నాయి. ఆయా ఏటీఎం మిషన్‌ల వద్ద సీసీకెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలి. కొన్ని ప్రధాన శాఖా కార్యాలయాల వద్ద తప్ప బ్యాంక్ ఏటీఎం మిషన్‌ల వద్ద సెక్యూరిటీ వారు లేకపోవడంతో ఇలాంటి చోరీలకు అవకాశం కలుగుతోంది. కడప నగరంలోని విశ్వేశ్వరయ్య సర్కిల్ వద్ద ఉన్న ఎస్‌బీఐ బ్యాంక్ ఏటీఎం మిషన్‌ను దుండగులు కొల్లగొట్టే సమయంలో సైరన్ మోగింది. ఇక్కడే గనక సెక్యూరిటీ వారు ఉండి ఉంటే వారు అప్రమత్తమై కడప నగరంలోని ఏటీఎం సెంటర్లకు సంబంధించిన నిర్వాహకులనుగానీ, పోలీసు సిబ్బందిని గానీ అలర్ట్ చేసి ఉండేవారు. ఫలితంగా రెండవ ఎస్‌బీఐ ఏటీఎం మిషన్‌లో చోరీ ఘటనకు అవకాశం లేకుండా పోయేది. మరోవైపు సీసీఎస్ పోలీసుల నిఘా కూడా కొరవడిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఏటీఎంల భద్రతపై ప్రశ్నార్థకం..
ఏటీఎంల నుంచి నగదు చోరీ చేసి తీసుకెళ్లిన ఘటనలు గతంలోనూ ఉన్నాయి. కడప నగర శివార్లలోని చింతకొమ్మదిన్నె మండలం పులివెందుల రోడ్డులో కెఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని ఎస్‌బిఐ ఏటిఎం మిషన్‌ను హర్యానా రాష్ట్రంకు చెందిన మేవాత్ గ్యాంగ్‌కు చెందిన దుండగులు గ్యాస్‌కట్టర్‌లను ఉపయోగించి రూ. 17 లక్షలను, రాజంపేట రోడ్డులో రిమ్స్ పిఎస్ పరిధిలో రామాంజనేయపురం వద్ద వున్న ఎస్‌బిఐ ఏటిఎం మిషన్‌లో నుంచి 24 లక్షలను మొత్తం రూ. 41 లక్షలను దోచుకుని వెళ్లారు. ఈ రెండు సంఘటనలు కూడా 2021 డిసెంబర్ 6–7 తేదీలలో తెల్లవారుజామున 2నుంచి 3 గంటల మధ్యే చేశారు. దొంగలు చోరీకి పాల్పడిన వెంటనే తాము ఉపయోగించిన స్కార్పియో వాహనాన్ని అప్పటికే తాము పథకం ప్రకారం ఓ లారీలోకి ఎక్కించి పోలీసుల నిఘా నుంచి తప్పించుకుని పరారయ్యారు. తాజా ఘటనలతో ఏటీఎంల భద్రతపై మళ్లీ సందేహాలు తలెత్తాయి.

మహిళలకు త్వరలో ఉచిత బస్సు ప్రయాణం

రాయచోటి టౌన్: మహిళలకు త్వరలో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ, క్రీడలు, యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఆదివారం అన్నమయ్య జిల్లా రాయచోటి రూరల్ పరిధిలోని శిబ్యాల గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం'ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి నుంచి అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి మూడు సిలిండర్లు ఉచితంగా అందజేయడానికి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిని రాబోయే ఐదు సంవత్సరాల్లో అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. విదేశాలకు జీవనోపాధి కోసం వెళ్లి కష్టాలు ఎదుర్కొంటున్నారని, అలాంటి వారికి ఇక్కడే జీవనోపాధి లభించే విధంగా ఫ్యాక్టరీలు, పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తామని చెప్పారు.



మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ఎన్‌సీసీ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

వైవీయూ: ఎన్‌సీసీ శిక్షణను కేడెట్స్ సద్వినియోగం చేసుకుని రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపిక కావాలని 30 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సతీందర్ దహియా సూచించారు. కడప నగరం తెలుగుగంగకాలనీలో నిర్వహిస్తున్న 7వ కంబైన్డ్ అన్యువల్ ట్రైనింగ్ క్యాంపును తిరుపతి గ్రూప్ కమాండర్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమాండర్ మాట్లాడుతూ కడప ఎన్‌సీసీ బెటాలియన్‌లో శిక్షణ, ఫైరింగ్ రేంజ్, ఇతర సౌకర్యాలు చక్కగా ఉన్నాయన్నారు. రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనేందుకు ఎన్‌సీసీ కేడెట్స్‌కు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం క్యాంపులో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ శిక్షణ, డ్రిల్, ఫైరింగ్ తదితర అంశాలను పరిశీలించారు.

గృహ నిర్మాణాలకు ప్రత్యేక అధికారులు

బి.కొత్తకోట: జిల్లాలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన నవరత్నాలు–పేదలందరికి ఇళ్లు కార్యక్రమంలో మంజూరై చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు కలెక్టర్ శ్రీధర్ చామకూరి చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పట్టణాల్లో నిర్మాణ లక్ష్యాలను సాధించడం కోసం ప్రత్యేక అధికారులను నియమించారు. బి.కొత్తకోట పట్టణానికి మదనపల్లె హౌసింగ్ ఈఈ, కోడూరుకు రాజంపేట డీఎల్‌డీఓ, మదనపల్లె రూరల్‌కు జలవనరులశాఖ ఎస్ఈ, మదనపల్లె పట్టణానికి డీపీఓ, పీలేరు రూరల్‌కు పరిశ్రమశాఖ జీఎం, పీలేరు పట్టణానికి పీఆర్ జిల్లా అధికారి, రాజంపేట పట్టణానికి హౌసింగ్ ఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, ఆర్అండ్‌బీ ఎస్ఈలు ముగ్గురిని, రాయచోటి రూరల్‌కు డ్వామా పీడీ, రాయచోటి పట్టణానికి డీఆర్‌డీఏ పీడీలను నియమిస్తూ శనివారం ఉత్తర్వులను జారీ చేసారు. వీరు పక్కా గృహ నిర్మాణాలను పర్యవేక్షిస్తూ సత్వరమే పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక తాత్కాలిక రద్దు

రాయచోటి: ఈనెల 23వ తేదీ జరగబోయే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులందరూ ప్రజా దర్బార్ కార్యక్రమంలో నిమగ్నమై ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి ఫిర్యాదులను సమర్పించేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయానిక రావద్దని కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.

క్లుప్తంగా

సర్వేయర్ల బదిలీలు

మదనపల్లె : మదనపల్లె డివిజన్ పరిధిలో పలు చోట్ల పని చేస్తున్న సర్వేయర్లను బదిలీ చేస్తూ సర్వే సెటిల్‌మెంట్స్, ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ శ్రీకేష్ బి.లత్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. అందులో మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో డివిజనల్ సర్వేయర్‌గా పని చేస్తున్న ఎం.కృష్ణమూర్తిని పలమనేరు ఆర్డీఓ కార్యాలయానికి, మదనపల్లె మున్సిపాలిటీకి చెందిన డి.పూర్ణచంద్రను వాల్మీకిపురం మండల సర్వేయర్‌గా బదిలీ చేశారు. హెచ్ఎన్ఎస్ఎస్ యూనిట్-1 మదనపల్లెలో పని చేస్తున్న పబ్బుతి గోపీనాథ్ నిమ్మనపల్లె మండలానికి, మదనపల్లె మండల సర్వేయర్ బి.వి. సుబ్రహ్మణ్యం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలోని జిల్లా సర్వే, ల్యాండ్ డిపార్ట్‌మెంట్ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

అధ్యాపకుడి ఇంటిలో చోరీ


తెరిచి ఉంచిన బీరువా

రాజంపేట : పట్టణంలోని కృష్ణానగర్‌లో అధ్యాపకుడు నాగరాజు, ఇంద్రావతి దంపతుల ఇటిలో చోరీ జరిగింది. బాధితుల ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. బీరువాలోని 15 తులాల బంగారు, రూ.2 లక్షల నగదు చోరీకి గురైనట్లు ఫిర్యాదు ఇచ్చారు. సంఘటన స్థలాన్ని సీఐ యల్లమరాజు, ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి పరిశీలించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


పట్టుకున్న కారు, మద్యం బాక్స్‌లతో పోలీసులు

పెద్దతిప్పసముద్రం : కర్ణాటక రాష్ట్రం నుంచి ఆంధ్రాకు అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని కారుతో సహా పోలీసులు పట్టుకున్నారు. ఏఎస్ఐ గోపాల్ నాయక్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ముందస్తుగా వచ్చిన సమాచారం మేరకు పోలీసులు మండలంలోని కందుకూరు సమీపంలోని జింకలమిట్ట వద్ద కాపు కాశారు. ఈ నేపథ్యంలో ములకలచెరువు మండలం సోంపల్లి పంచాయతీ అడవి నాయినిచెరువు గ్రామానికి చెందిన మహేష్ (33) అనే వ్యక్తి కర్ణాటక రాష్ట్రం చేలూరు నుంచి కారులో వస్తుండగా పోలీసులు తనిఖీ చేశారు. కారులో రూ.1.53 లక్షల విలువ చేసే 40 బాక్సుల కర్ణాటక మద్యం ఉన్నట్లు గుర్తించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్ఐ పేర్కొన్నారు. కారుతో సహా మద్యంను పట్టుకున్న పోలీసులను ఇన్‌చార్జి ఎస్ఐ గాయత్రి అభినందించారు.

కరెంట్‌షాక్‌తో రైతుకు గాయాలు

నిమ్మనపల్లె : కరెంట్ షాక్‌తో రైతు గాయపడిన సంఘటన ఆదివారం తెల్లవారుజామున జరిగింది. మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీ దివిటివారిపల్లెకు చెందిన రైతు మునిరత్నం(55) పొలం వద్ద నీరుపెట్టేందుకు వెళ్లాడు. మోటారు స్టార్టర్ ఆన్ చేస్తుండగా, విద్యుత్‌షాక్‌కు గురై తీవ్ర గాయాల పాలయ్యాడు. ఉదయాన్నే గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాధితుడ్ని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం కోలుకుంటున్నాడు.

వరికి తెగులు.. రైతుకు దిగులు

- వర్షాభావంతో అరకొరగా సాగు
- సుడిదోమతో తీవ్రనష్టం
- సస్యరక్షణ చర్యలతోనే నివారణ


సుడిదోమ పీల్చడంతో ఎండిన వరి పంట మొదళ్లు

రాయచోటి : వ్యవసాయమే జీవనాధారంగా పోరాటం చేస్తున్న రైతులపై ప్రకృతి పగబట్టింది. రాష్ట్రంలో ఒక వైపు వరదలతో అల్లాడుతుంటే.. రాయలసీమ జిల్లాల్లో ఒకటైన అన్నమయ్య జిల్లాలో తీవ్ర వర్షాభావంతో అరకొరగా సాగైన పంటలకు నీటి కొరత ఒక వైపు.. సాగైన పంటలకు తెగుళ్ల దాడులు ఇంకో వైపు వెంటాడుతున్నాయి.

ఇప్పటికే అడుగంటిన భూగర్భ జలాలతో అంతంత మాత్రంగా సాగైన వరి పంటకు సుడిదోమ తెగులు పట్టి పీడిస్తోంది. సాగైన పంట పొట్టకు వచ్చి కంకిగా మారే సమయంలో తెగుళ్ల రూపంలో చుట్టుముట్టాయి. జిల్లాలో 10 వేల హెక్టార్లకు పైగా వరి సాగు కావాల్సి ఉంది. సాధారణ సాగులో 20 శాతానికి మంచి వరి పంటను సాగు చేయలేదు. సాగు చేసిన పంటకు తెగుళ్ల రూపంలో రైతులను వెంటాడుతున్నాయి. సాగు చేసిన పంటకు తగినంత నీటిని అందివ్వలేక కొంత మంది రైతులు ఆశలు వదులుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆశిస్తున్న తెగుళ్ల రైతులను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. అనావృష్టి కారణంగా ఉక్కపోతగా మారడంతో సుడిదోమ ఉద్ధృతి ఎక్కువైంది. పంట బాగా పెరిగి కరుకు దశకు చేరుకుని.. కంకి ఇడుస్తున్న సమయంలో ఆశిస్తున్న తెగుళ్ల నివారణకు రైతులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. పిల్ల, పెద్ద దోమలు నీటిపై భాగంలో తేలియాడుతూ దుబ్బుల మొదళ్ల దగ్గర రసం పీల్చడంతో ఆకులు పసుపు రంగులోకి మారుతున్నాయి. నివారణ చర్యలు చేపట్టకపోతే పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. సన్న రకాల్లో త్వరగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు.

తెగులు సోకే విధానం

వరి పొలాల్లో సుడి దోమలు ఉంటాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వర్షాల తర్వాత వాతావరణం ఉక్కపోతగా మారడంతో దోమ తన ఉద్ధృతిని పెంచుకుంది. ఎక్కువ సంఖ్యలో దోమలు పంట మొదళ్ల చుట్టూ కనిపిస్తాయి.

- పొలాల్లో నీటిపై భాగంలో తేలుతూ మొదళ్ల చుట్టూ తిరుగుతూ రసాన్ని పీల్చడంతో ఆకులు పసుపు రంగులోకి మారుతాయి. ఉద్ధృతి ఎక్కువగా ఉంటే నీటిపై నూనె తెట్టులాగా కనిపిస్తుంది. మొక్క సుడులుగా ఎండిపోతుంది. దీనిని హాప్ బర్న్‌గా పిలుస్తారు.

పంట నష్టం

పొట్ట దశలో ఉద్ధృతి ఎక్కువైతే పంటకు గింజ రాదు. గింజ దశలో వస్తే నాణ్యత దెబ్బతింటుంది. నూక శాతం పెరిగి దిగుబడి పడిపోతుంది. ఒక్కోసారి పంట చేతికి రాకపోవచ్చు.

సస్యరక్షణ ఇలా..

పొలాల్లో 5 నుంచి 10 దోమలు కనిపిస్తే తూర్పు, పడమర దిశగా రెండు మీటర్ల దూరంగా పాయలు ఏర్పాటు చేయాలి. దీంతో పంటకు గాలి, వెలుతురు సోకి దోమ ఉద్ధృతి తగ్గుతుంది. పొలంలో నీటిని పెడుతూ తీసివేస్తే గుడ్లు, పిల్ల పురుగుల ఉద్ధృతి తగ్గుతుంది.

పిచికారీ

దోమ కనిపించిన మొదటి దశలో వేపనూనె 1500 పీపీఎంను 5 మిల్లీలీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. తర్వాత దశలో ట్‌లెప్తమిజో ఫైరిమ్ మందును 94 మి.లీ వంతున ఎకరానికి పిచికారీ చేయాలి. పొట్ట దశలో యూరియాతోపాటు పొటాష్ కలిపి వేసుకుంటే మొక్క రోగనిరోధకశక్తి పెరుగుతుందని రాయచోటి మండల వ్యవసాయాధికారి దివాకర్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


మృతి చెందిన జయపాల్

మదనపల్లె : యువకుడు బావిలో శవమై అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన ఆదివారం మదనపల్లె మండలంలో వెలుగు చూసింది. నిమ్మనపల్లె మండలం రాచవేటివారిపల్లె పంచాయతీ ఆచార్లపల్లెకు చెందిన వెంకటేష్, సుజాత దంపతుల కుమారుడు జయపాల్(27) వ్యవసాయం చేస్తూ జీవించే వాడు. ఇతడికి నాలుగేళ్ల క్రితం ఇంద్రాణితో వివాహమైంది. సంతానం లేదు. ఇటీవల మద్యానికి బానిస అయ్యాడు. ఈ క్రమంలో ఇంట్లో గొడవలు జరిగాయి. తల్లిదండ్రులు, సోదరుడు అతడిని వేరు కాపురం పెట్టాల్సిందిగా సూచించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం తల్లి సుజాత ఎరువులు కొనుగోలు చేసేందుకై రూ.10 వేల నగదు జయపాల్‌కు ఇచ్చింది. అదే రోజు కుటుంబ సమస్యలతో గొడవపడి జయపాల్ ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పలుచోట్ల గాలించారు. అయినా ఫలితం కనిపించలేదు. గాలింపులో భాగంగా ఆదివారం మదనపల్లె బైపాస్‌రోడ్డు నిమ్మనపల్లె సర్కిల్ వద్ద మెయిన్‌రోడ్డుకు పక్కన ఉన్న నవీన్‌రెడ్డి బావిలో ఓ వ్యక్తి మృతి చెంది నీటిపై తేలియాడుతుండగానే గమనించారు. తీరా దగ్గరకు వెళ్లి చూడగా, అతడిని జయపాల్‌గా నిర్ధారించుకుని తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. దీంతో తాలూకా ఏఎస్ఐ సుబ్రహ్మణ్యం సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులను, పరిసర ప్రాంతాల్లోని ప్రజలను ఘటనకు దారితీసిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఇంటి నుంచి వచ్చిన జయపాల్, అదేరోజు రాత్రి నిమ్మనపల్లె సర్కిల్ సమీపంలోని డాబాలో స్నేహితులతో కలిసి మద్యం సేవించినట్లు తెలిసింది. ద్విచక్ర వాహనాన్ని బైపాస్‌రోడ్డు బేకరి వద్ద వదిలిపెట్టి వెళ్లడాన్ని నిర్ధారించారు. స్నేహితులతో కలిసి మద్యం తాగిన కారణంగా గొడవపడి చంపారా..? లేక అతడే కుటుంబ సమస్యలతో ఆత్మహత్యకు పాల్పడ్డాడా అనే విషయాలు స్థానికుల్లో చర్చనీయాంశమయ్యాయి. అదేవిధంగా జయపాల్ భార్య ఇంద్రాణి, భర్త మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కళావెంకటరమణ తెలిపారు.

గాయపడిన మహిళ..


మృతి చెందిన నారాయణ సుబ్బలక్షుమ్మ

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పార్వతీపురానికి చెందిన నారాయణ సుబ్బలక్షుమ్మ (48) అనే మహిళ శనివారం రాత్రి రోడ్డు మీద నడుచుకుంటూ వస్తుండగా బైక్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. ఆమెను 108 వాహనంలో కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం కడప లోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. ఆమె కండీషన్ బాగలేక పోవడంతో వేలూరుకు తీసుకెళ్లాలని వైద్యులు రెఫర్ చేశారు. ఇంతలోనే ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో శనివారం రాత్రి 10 గంటలకు మృతి చెందారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈమె భర్త రఘు 6 ఏళ్ల కిందట పక్షవాతంతో మరణించాడు. వారికి ఇద్దరు పిల్లలు. కూతురికి వివాహమైంది. కుమారుడు సురేంద్ర ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

ట్రిపుల్ ఐటీలో టీడీపీ కార్యకర్తల హల్‌చల్

వేంపల్లి : ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో శనివారం మధ్యాహ్నం టీడీపీ కార్యకర్తలు హల్‌చల్ చేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీడీపీ కార్యకర్తలు రోజురోజుకు రెచ్చిపోతున్నారు. అనుమతి లేకుండా క్యాంపస్‌లోకి పది మంది చొరబడి బెదిరింపులకు పాల్పడ్డారు. ఆర్కే వ్యాలీ క్యాంపస్‌లో విద్యార్థులు, అధ్యాపకులు దాదాపు 9,000 మంది ఉన్నారు. విద్యార్థుల అవసరాల కోసం అధికారులు మూడు క్యాంటీన్లను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు వీటిని వైఎస్సార్ సీపీకి చెందిన వారు నడుపుతున్నారు. అయితే ట్రిపుల్ ఐటీ అధికారులు అక్టోబర్ 12వ తేదీ లోపల క్యాంటీన్లను ఖాళీ చేయాలని నోటీసులు పంపారు. కొత్త క్యాంటీన్లకు టెండర్లు వేసిన తర్వాతనే ప్రస్తుతం ఉన్న వాటిని రద్దు చేయాలి.. అలా కాకుండా వచ్చే నెలలో ఖాళీ చేయాలని నోటీసులు పంపడం చాలా బాధాకరంగా ఉందని క్యాంటీన్ యజమానులు వాపోతున్నారు. అంతలోపే టీడీపీ కార్యకర్తలు క్యాంటీన్ వద్దకు వచ్చి మా ప్రభుత్వం వచ్చింది.. మీరు ఖాళీ చేయాలని బెదిరింపులకు దిగడం దారుణం అన్నారు. అంతేకాకుండా విద్యార్థులకు భోజన వసతి కార్యక్రమంలో భాగంగా మెస్ యజమానులకు నూజివీడు క్యాంపస్‌లో సమావేశం ఉంటుందని అధికారులు మెసేజ్ ఇవ్వడం జరిగింది. ఈ విషయంపై ట్రిపుల్ ఐటీ అధికారులను వివరణ అడగగా వచ్చే నెలలో క్యాంటీన్లకు సంబంధించి టెండర్లు పిలుస్తామని అక్టోబర్ 12వ తేదీ లోగా క్యాంటీన్ల యజమానులకు నోటీసులు పంపామని తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతర పోరాటం

వైవీయూ : ఉపాధ్యాయ సమస్యలపై ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) నిరంతరం పోరాటం చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి కులశేఖర్‌రెడ్డి అన్నారు. ఏపీటీఎఫ్ ఆవిర్భవించి 80 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో కడప పాత బస్టాండ్ సమీపంలోని ఎన్జీవో హోంలో ఆదివారం జిల్లా విద్యా వైజ్ఞానిక మహాసభ జిల్లా అధ్యక్షులు బత్తలరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కులశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఉపాధ్యాయులు స్వేచ్ఛగా బోధన చేసే పరిస్థితులు లేవన్నారు. బోధనకు ఆటంకంగా ఉన్న అనవసరమైన యాప్‌లను తొలగించాలని, మీడియం, సిలబస్ తరగతుల విలీనంపై స్పష్టత ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు విశ్వనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఏపీటీఎఫ్ చరిత్ర, నాయకత్వ పటిమను వివరించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన కడప జిల్లా ఎన్జీవో అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, రవికుమార్ మాట్లాడుతూ ఏపీటీఎఫ్ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, సమాజ శ్రేయస్సు కోసం పాటుపడడం గర్వించదగ్గ విషయమని అన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కమిటీ సభ్యులు సాంబశివారెడ్డి మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక వసతులకు అవసరమైనటువంటి కాంపోజిట్ స్కూల్ గ్రాంట్‌లను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కడప జిల్లా డీసీఈబీ సెక్రటరీ భాస్కర్‌రెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షుడు రాజులు, జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి వీరాంజులరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాళ్లపల్లి అబ్దుల్లా, జిల్లా అసోసియేటివ్ అధ్యక్షుడు ప్రతాపరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఈశ్వర్‌రెడ్డి, నాగభూషణం, చంద్రశేఖర్‌రెడ్డి, కాసిం వలి, జిల్లా కార్యదర్శులు చెన్నారెడ్డి, రమేష్‌బాబు, భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

రెవెన్యూలో చిత్తుకాగితాల కాల్చివేత చిచ్చు

- అభాసుపాలైన రాజంపేట తహసీల్దార్ కార్యాలయం
- మీడియాకు ఉప్పందించిన ఓ అధికారి
- సిబ్బందిని ఆరా తీసిన సబ్‌కలెక్టర్


రాజంపేట తహసీల్దారు కార్యాలయం

రాజంపేట : నియోజకవర్గ కేంద్రమైన రాజంపేట తహసీల్దారు కార్యాలయంలో చిత్తుకాగితాల కాల్చివేత చిచ్చు జిల్లా రెవెన్యూ శాఖను అభాసుపాలు చేసింది. ఇద్దరు ఉద్యోగుల మధ్య ఉన్న ఆధిపత్య పోరుతో.. ఆ చిత్తుకాగితాల కాల్చివేతను వేరే విధంగా జనంలోకి తీసుకెళ్లడానికి కారణమైందన్న విషయం బహిర్గతమైంది. మీడియాకు ఉప్పందించిన వారిలో శాఖాపరమైన అధికారే అనే అనుమానాలు నెలకొన్నాయి. పనికిరాని పేపర్లను సిబ్బంది కాల్చివేస్తుండటం సహజంగా జరుగుతుంటోంది. అదే విధంగా రెవెన్యూ కార్యాలయంలో ఉన్న పనికిరాని పాతపేపర్లను కాల్చివేశారు. దాన్ని ఎల్లోమీడియాతోపాటు కొన్ని ట్యూబ్ చానల్‌లు, సామాజికమాధ్యమాలలో గత ప్రభుత్వంలో ఏదో జరిగింది, ఆ రికార్డులను కాల్చినట్లుగా విషప్రచారం చేసుకున్నారు. అవన్నీ చిత్తుకాగితాలని డీఎస్పీ సుధాకర్ వెల్లడించడంతో.. ఆ తర్వాత ప్రచారానికి బ్రేక్‌పడింది.

అంతర్గత పోరు

ఇంటి దొంగను ఈశ్వరుడు కూడా పట్టుకోలేడన్న సామెతను.. రాజంపేట తహసీల్దారు కార్యాలయంలోని ఓ అధికారి చిత్తుకాగితాల కాల్చివేతను, రెవెన్యూ రికార్డులు కాల్చినట్లుగా మీడియాకు ఉప్పందించినట్లుగా విశ్వసనీయంగా తెలిసింది. దీంతో ఆయన అనుకున్నట్లుగానే ఈ అంశం వైరల్ అయింది. ఈ విధంగా చేయడం వల్ల ఈ అపవాదును భరించే అధికారిని బదిలీ చేస్తారని ఆయన విశ్వాసం. ఆయన స్థానంలో తాను ఉండవచ్చుననే ఎన్నికల ముందు వచ్చిన అధికారి పన్నాగమనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

విచారణ

రెవెన్యు శాఖలో చిత్తుకాగితాల కాల్చివేతను, మరో విధంగా రికార్డులు కాల్చివేశారన్నట్లుగా రెవెన్యూ శాఖ దుష్ప్రచారంపై రహస్య విచారణ జరుగుతోంది. చిత్తుకాగితాల కాల్చివేత సంఘటనపై రాత్రి సబ్‌కలెక్టర్ నైదియా దేవి నేరుగా తహసీల్దారు కార్యాలయానికి వచ్చి వివరాలు సేకరించారు. చిత్తుకాగితాల కాల్చివేతను చలికాచుకొని లబ్ధి పొందే వారెవను అనే కోణంలో ఆమె విచారణ చేసింది. ఓ అధికారి సెల్ కూడా పరిశీలించినట్లు తెలిసింది. చిత్తుకాగితాల కాల్చివేతను మరో విధంగా ఉప్పందించిన వారెవరు, రెవెన్యూ శాఖను అభాసుపాలు చేసిన తీరుతెన్నులపై జిల్లా కలెక్టరుకు నివేదిక సమర్పించాల్సి ఉంటుందని రెవెన్యూ వర్గాలు అంటున్నాయి. చిత్తుకాగితాల కాల్చివేతపై దుష్ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని డీఎస్పీ సుధాకర్ వెల్లడించిన సంగతి విదితమే.

మార్గంమధ్యలో ఆగిన అంబులెన్స్

క్షతగాత్రులు లేకపోవడంతో తప్పిన ముప్పు


టి.మాదిగపల్లి వద్ద ఆగిపోయిన 108 అంబులెన్స్ వాహనం

కలికిరి : సాంకేతిక లోపంతో 108 అంబులెన్స్ మార్గంమధ్యలో ఆగిపోయిన ఘటన కలికిరి మండలంలో చోటు చేసుకుంది. మదనపల్లికి చెందిన 108 అంబులెన్స్ వాహనం శనివారం అర్ధరాత్రి ఓ మహిళను ప్రవసం కోసం తిరుపతికి తీసుకెళ్లింది. తిరుగు ప్రయాణంలో తిరుపతి నుంచి మదనపల్లికి వస్తుండగా.. ఉదయం 4 గంటల సమయంలో కలికిరి సమీపంలోని టి.మాదిగపల్లి వద్ద వెనుకటైరు యాక్సెల్ విరిగిపోవడంతో ఆగిపోయింది. దీంతో 108 సిబ్బంది ఉదయం వరకూ అక్కడే వేచి ఉండి.. కలికిరి 108 వాహనం సాయంతో మదనపల్లికి వెళ్లి సంబంధిత వాహన మెకానిక్‌ను తీసుకువచ్చి మధ్యాహ్నం మరమ్మతులు చేయించారు. వాహనం తిరుగుప్రమాణంలో కాకుండా.. ప్రమాద సమయంలో క్షతగాత్రులను తరలించే క్రమంలో ఇలా ఆగిపోయి ఉంటే ఇబ్బంది జరిగి ఉండేదని 108 సిబ్బంది అన్నారు. ప్రభుత్వం 108 వాహనాల మెయింటినెన్స్‌పై దృష్టి సారిస్తే ఇలాంటి ఇబ్బందులు తలెత్తవని చూసిన వాహనదారులు అన్నారు.

గ్రామసభలో నాయకుల నిలదీత

సమస్యలు తీర్చాలని కోరిన స్థానికులు


గ్రామసభలో నాయకులను ప్రశ్నిస్తున్న మహిళలు

వీరబల్లి : వంద రోజుల పాలన పూర్తయిన నేపథ్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాలను టీడీపీ నిర్వహిస్తోంది. ఇందుకోసం గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేస్తోంది. ఇందులో భాగంగా ప్రజా సమస్యలపై చర్చించాలని సూచించింది. ఈ మేరకు శనివారం అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలంలోని పెద్దివీడు పంచాయతీలో టీడీపీ రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఈ సభకు మండలస్థాయి అధికారులు ఎవరూ హాజరుకాకపోడం గమనార్హం. ఈ సభలో తమ సమస్యలను తీర్చాలంటూ ప్రజలు పట్టుబట్టారు. ప్రస్తుతం తాగడానికి నీరులేదని, వీధి రోడ్లు లేవని, తాము చాలా ఇబ్బందులు పడుతున్నామని, సమస్యలు తీర్చాలంటూ నాయకులను నిలదీశారు. దీనికితోడు అధికారులు రాకపోవడంతో సమస్యలను ఎవరి దృష్టికి తీసుకెళ్లాలని వారిలో వారే చర్చించుకున్నారు. ప్రజల సమస్యలను తీర్చాల్సిన అధికారులే గ్రామసభకు రాకపోవడంతో నాయకులు కొంత అసహనానికి గురయ్యారు. అనంతరం అధికారులపై మండిపడ్డారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు తాటిగుట్ల శ్రీధర్‌రెడ్డి, తాటిగుట్ల సురేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు గాయపడ్డారు. ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం కురబలకోట మండలంలో జరిగింది. వేమారెడ్డిపల్లెకు చెందిన భాస్కర్ రెడ్డి(60) అదే గ్రామానికి చెందిన మొర్రంరెడ్డి(64)తో కలిసి ద్విచక్రవాహనంలో వస్తుండగా, అంగళ్లు- కురబలకోట మార్గంలో ఎదురుగా వచ్చిన లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో వారిద్దరూ తీవ్రంగా గాయపడగా, గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం మొరంరెడ్డి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. ముదివేడు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని..

ములకలచెరువు : ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో నలుగురికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం ఉదయం మండలంలో చోటుచేసుకుంది. గంగిరెడ్డిపల్లెకు చెందిన చంద్రశేఖర్(45), బావయ్య(48)లు ద్విచక్రవాహనంలో పనుల మీద మదనపల్లెకు వెళ్తుండగా పెద్ద పాళ్యం వద్దకు రాగానే.. కురబలకోట మండలం తుంగావారిపల్లెకు చెందిన లక్ష్మన్న(38), లక్ష్మయ్య(45)లు ద్విచక్రవాహనంలో కదిరికి బయలుదేరారు. వారి ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆ నలుగురిని 108 సహాయంతో స్థానికులు ములకలచెరువు పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆవును తప్పించబోయి..


గాయపడ్డ విశ్వనాథ్

పీలేరు రూరల్ : రోడ్డు ప్రమాదంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు గాయపడ్డ సంఘటన మండలంలోని కావలిపల్లె పంచాయతీ పొంత చెరువు క్రాస్ సమీపంలో చోటు చేసుకుంది. వివరాలిలా వున్నాయి.

కేవీపల్లె మండలం వగళ్ల పంచాయతీ కొండకిందపల్లెకు చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు ఎం.విశ్వనాథ్ (38) ద్విచక్రవాహనంలో తమ స్వగ్రామానికి బయలుదేరాడు. రోడ్డుపై వెలుతున్న ఆవును తప్పించబోయి వాహనం బోల్తా పడింది. తీవ్రంగా గాయపడ్డ ఆయనను చికిత్సనిమిత్తం 108 వాహనంలో పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

ఆర్వోబీ రక్షణగోడను ఢీకొన్న కారు


ఆర్వోబీ రక్షణగోడను ఢీకొన్న కారు


ఆర్వోబీ ఫుట్‌పాత్‌పై ఆగిన కారు


రాజంపేట : రాజంపేట-రాయచోటి రహదారిలోని ఆర్వోబీ(రోడ్ ఓవర్ బ్రిడ్జి)పై ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. రాయచోటికి వెళుతున్న కారు, ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి.. ఆర్వోబీ ఫుట్‌పాత్ రక్షణగోడను ఢీకొని ఆగింది. దీంతో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. కొంత ముందుకు వెళ్లి ఉంటే ఆర్వోబీ నుంచి కింద పడే పరిస్థితి ఉండేదని స్థానికులు పేర్కొన్నారు. రక్షణగోడ దెబ్బతింది. కాగా ఈ ప్రమాదం చోటుచేసుకునే క్రమంలో ఆర్వోబీ కింద జనసంచారం లేకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. లేనిపక్షంలో పెచ్చులు వారి మీద పడేవి. రక్షణ గోడను ఢీకొన్న కారు అలాగే ఫుట్‌పాత్‌పై నిలిచిపోయింది. ఆర్వోబీపై ట్రాఫిక్ స్తంభించిపోయింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ట్రాఫిక్ క్లియిరెన్స్ చర్యలు తీసుకున్నారు. కారులో ఉన్న వారికి స్వల్పగాయాలు అయ్యాయి.

ఖాళీ ఉర్దూ టీచర్ పోస్టులు భర్తీ చేయాలి


మాట్లాడుతున్న రూటా రాష్ట్ర కోఆర్డినేటర్ మహమ్మద్ ఆయూబ్

రాయచోటి అర్బన్ : రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉర్దూ టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని రూటా రాష్ట్ర కోఆర్డినేటర్ మహమ్మద్ ఆయూబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని రూటా కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఉర్దూ ఉపాధ్యాయుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2024లో ప్రభుత్వం ఉర్దూ డీఎస్సీని నిర్వహించి రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులన్నింటినీ భర్తీ చేయడం ద్వారా ఉర్దూ విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. రూటా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మహమ్మద్‌అలీ మాట్లాడుతూ రోష్ని పథకంను రాష్ట్రంలో పునఃప్రారంభించి రాష్ట్రవ్యాప్తంగా సర్వేను నిర్వహించి నూతనంగా 500 ఉర్దూ పోస్టులను ఏర్పాటు చేయాలంటూ కోరారు. రూటా రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి అసదుల్లాబాషా మాట్లాడుతూ రాష్ట్రంలో 55 వేల అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వాటిలో ఒక్కటి కూడా ఉర్దూ అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడంతో ఉర్దూ విద్యా వ్యవస్థ మనుగడకే ప్రమా దకరంగా మారిందన్నారు. వెంటనే రాష్ట్రంలో 5 వేల ఉర్దూ అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులకు ఉర్దూ విద్యను అందుబాటులోకి తేవడంతో పాటు ఉర్దూ నిరుద్యోగ మైనార్టీ యువతులకు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లుగా ఉపాధి కల్పించాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రూటా రాష్ట్ర నేతలు మహమ్మద్‌హాషీం, జాఫరుద్దీన్, జిల్లా నేతలు హుమయుద్దీన్, ఇంరోజ్‌అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో వర్గపోరు


బి.కొత్తకోటలో జయచంద్రారెడ్డి వ్యతిరేక వర్గ సంబరాలు

బి.కొత్తకోట : టీడీపీలో నెలకొన్న వర్గపోరు ఇంకా చల్లారలేదు. వంద రోజులు పూర్తి చేసుకున్న కూటమి ప్రభుత్వం చేపట్టిన 'ఇది మంచి ప్రభుత్వం' అనే కార్యక్రమంలో వర్గపోరు రోడ్డెక్కింది. ఆదివారం బి.కొత్తకోటలో ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిపాలైన జయచంద్రారెడ్డి వర్గం నాయకులు ప్రచారం నిర్వహిస్తుంటే.. ఆయన్ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న టీడీపీలోని సీనియర్ నేతలు, ముఖ్య నాయకులంతా కలిసి జ్యోతిచౌక్‌లో సంబరాలు చేసుకున్నారు. భారీగా టపాసులు కాల్చి కేక్ కట్ చేశారు. ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను అతికిస్తూ ప్రచారం చేసుకున్నారు. ఒకేసారి రెండు వర్గాలు పోటాపోటీగా కార్యక్రమాలు నిర్వహించడంతో వర్గపోరు మరింత ముదిరింది. ఇప్పటికే వ్యతిరేక వర్గం జయచంద్రారెడ్డిపై చంద్రబాబు, లోకేష్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడికి ఫిర్యాదులు చేసిన విషయం తెలిసిందే. ఈ రెండు వర్గాలే కాక పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొండ్రెడ్డి కూడా నియోజకవర్గ బాధ్యతల కోసం ప్రయత్నాలు చేస్తుండటంతో ముచ్చటగా మూడు వర్గాలు ఆధిపత్యం కోసం పోరు సాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో నియోజకవర్గ బాధ్యతలను కొత్త నాయకుడికి అప్పగిస్తారన్న ప్రచారం సాగుతోంది.